నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 WARANGAL HANUMAKONDA




మేడారంలో ఇంకా పూర్తి కాని తాత్కాలిక బస్టాండ్ పనులు

# ఎవరికి వారే!

## అధికారుల్లో సమన్వయ లోపం.. భక్తులకు సంకటం.. మహా జాతర పనుల్లో నిర్లక్ష్యం

- ఉన్నతాధికారులు, జిల్లా అధికారుల తలోదారి
- పర్యవేక్షణ లేక ముందుకు సాగని పనులు
- ఇంకా ఏర్పాటుకాని తాత్కాలిక బస్టాండ్
- దేవాదాయ శాఖ పనులు, సీసీ రోడ్లదీ ఇదే దుస్థితి

వరంగల్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దేశంలోనే అతి పెద్ద గిరిజన ఉత్సవంగా ప్రసిద్ధి గాంచిన మేడారం మహా జాతర పనుల నిర్వహణలో ప్రభుత్వ పర్యవేక్షణ కరువవుతున్నది. ఆయా శాఖల అధికారులు 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఉన్నతాధికారులు, ములుగు జిల్లా అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయి. మేడారం జాతర ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరుగనుంది. భక్తులు ఇప్పటి నుంచే భారీగా వస్తున్నారు. ఆది, బుధవారాల్లో వేలాది మంది తల్లులను దర్శించుకుంటున్నారు. సెలవు రోజుల్లో రద్దీ అధికంగా ఉంటున్నది. ముందస్తుగా మొక్కులు చెల్లించేందుకు మేడారం వచ్చే భక్తులకు కనీస వసతులు ఉండడం లేదు. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించింది. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఈ నిధులతో పనులు చేపట్టారు. జాతర దగ్గర పడుతున్నా ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మేడారం జాతరకు పేద, మధ్య తరగతి ప్రజలే ఎక్కువగా వస్తుంటారు. జాతరకు వచ్చే దాదాపు కోటి మందిలో 90 శాతం వీరే ఉంటారు. వీరు ఆర్టీసీ బస్సుల్లోనే జాతరకు వస్తారు. జాతర సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ పార్కింగ్ ఏర్పాటు చేస్తుంది. ప్రైవేట్ వాహనాలను వన దేవతల గద్దెలకు చాలా దూరంలో నిలుపుతారు. ఆర్టీసీ బస్సుల్లో వచ్చే వారు గద్దెల దగ్గరి వరకు పోతారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో మేడారంలో బస్టాండ్ నిర్వహణ ఉంటుంది. జాతరకు వచ్చి వెళ్లే లక్షల మందితో ఈ బస్టాండ్ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ఆర్టీసీ దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేస్తుంది. భక్తుల తాకిడి నానాటికీ పెరుగుతున్నా ఈ సారి ఇంకా బస్టాండ్ పనులు పూర్తి కాలేదు. కొద్ది ప్రాంతంలోనే చదును చేసి వెదురు పందిళ్లు వేశారు. టిక్కెట్లు ఇచ్చే, ఆర్టీసీ సిబ్బంది ఉండే ప్రదేశంలోనే పనులు పూర్తయ్యాయి. భక్తులు వచ్చి వెళ్లేందుకు వీలుగా ఉండే ప్రాంతంలో ఇంకా భూమి చదును పూర్తి కాలేదు.

### హడావుడే ఎక్కువ..

జాతర ఏర్పాట్లకు సంబంధించి మంత్రులు అప్పడప్పుడు మేడారం వస్తున్నారు. దర్శనాలు, ఇతర హడావుడి తప్ప పనులపై సమగ్రమైన సమీక్షలు జరపడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జాతర జరిగే నాలుగు రోజుల్లో లక్షలాదిగా వచ్చే భక్తులు, వీఐపీల రాకపోకల కోసం చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షలో చర్చ జరగడం లేదని అధికారులే చెబుతున్నారు. మంత్రులు, ఇతర ముఖ్య ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు హడావుడి తప్ప పనులను స్వయంగా పర్యవేక్షించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. జాతర నిర్వహణలో కీలకమైన ఆదివాసీ వర్గాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించలేదన్న చర్చ జరుగుతున్నది. జాతర క్రతువులు, వాటికి సంబంధించిన అంతర్గత ఏర్పాట్లపైనా ఆదివాసీలతో చర్చిస్తే బాగుంటుందని కింది స్థాయి సిబ్బంది సూచిస్తున్నారు.



మేడారం గద్దెల సమీపంలో నిర్మిస్తున్న పోలీస్ ఔట్ పోస్టు

### కొలిక్కిరాని పారిశుధ్య పనులు

మేడారం జాతరలో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమైంది. లక్షల మంది వచ్చి వెళ్లే జాతరలో అపరిశుభ్రతతో అందరికీ ఇబ్బందులు కలుగుతాయి. గత జాతర కోసం కేసీఆర్ ప్రభుత్వం 320 కేంద్రాల్లో 6,400 మరుగుదొడ్లు నిర్మించింది. జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద భక్తులు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు నిర్మించింది. పారిశుధ్య నిర్వహణ కోసం నాలుగు వేల మంది కార్మికులను నియమించి మేడారం పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచే ఏర్పాట్లు చేసింది. 100 ట్రాక్టర్లు, 20 టాటా ఏస్ వాహనాలు, ఎనిమిది ఎక్స్‌కవేటర్లతో నిత్యం చెత్తను తొలగించేవారు. గత జాతర నిర్వహణ కోసం చేసిన నిర్మాణాలు వానకాలంలో వచ్చిన భారీ వరదలతో కొట్టుకుపోయాయి. ఇప్పుడు మళ్లీ చేయాల్సిన అవసరం ఉన్నది. జాతరకు అనుగుణంగా ఈ పనులు పూర్తి కావాలి. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. దేవాదాయ శాఖ చేపట్టిన చలువ పందిళ్లు, సున్నాల పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. భక్తుల భద్రతా పర్యవేక్షణ కోసం మేడారం గద్దెల పక్కన నిర్మిస్తున్న పోలీస్ ఔట్ పోస్టు పనులు ఇంకా పూర్తి కాలేదు. చింతల్ క్రాస్ నుంచి మేడారం వరకు రూ. 2కోట్ల85 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పూర్తి కాలేదు. పర్యవేక్షణ లేకనే ఇలా జరుగుతోందని అధికారుల్లోనే చర్చ జరుగుతున్నది. జిల్లాలోని ఉన్నతాధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు ఎవరికి వారుగా తమకు తోచినట్లు పనులు చేసుకుంటూ పోతున్నారని, ఇలాంటి సమన్వయ లేమి పరిస్థితులు గతంలో ఎప్పుడు లేవని అధికార వర్గాలు అంటున్నాయి. పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల మధ్య సమన్వయం కుదిరితేనే జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.



మేడారం పరిసరాల్లో చెత్త ఏరుతున్న పారిశుధ్య కార్మికులు

# మేడారంలో శ్రమ దోపిడీ

## పారిశుధ్య కార్మికులతో వెట్టిచాకిరీ

**పన్నెండు గంటల పనికి రూ.600**

**కన్నెత్తి చూడని కార్మిక శాఖ అధికారులు**

ములుగు, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : మేడారం మహా జాతరలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టర్ మహారాష్ట్ర నుంచి పేదలను తీసుకొచ్చి ఎనిమిది గంటలకు బదులు 12 గంటలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాడు. అంతేకాకుండా రూ.600 మాత్రమే ఇస్తూ అన్యాయం చేస్తున్నాడు. మేడారం విధుల్లో కార్మికులకు అవసరమైన సేఫ్టీ పరికరాలు, నిబంధనల ప్రకారం పని గంటలు, కూలీ రేట్లను అమలు చేయాల్సిన కార్మిక శాఖ అధికారులు ఏమేరకు పనిచేస్తున్నారో దీనిని బట్టి అర్థమవుతోంది.

### కోట్ల రూపాయలు దండుకుంటున్న కాంట్రాక్టర్

జాతరలో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు కోట్ల రూపాయలు ఇస్తున్నా కూలీలకు నామమాత్రంగా డబ్బులు ఇస్తూ పెద్ద మొత్తంలో తన జేబులో నింపుకొంటున్నాడని పలువురు విమర్శిస్తున్నారు. ఎనిమిది గంటలకు బదులు 12 గంటలు పని చేయించడమే కాకుండా రూ.600 మాత్రమే ఇస్తున్నాడని కార్మికులు వాపోతున్నారు. తమకు ఎక్కువ కూలీ కావాలని అడిగితే కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

### 12 గంటలు పని చేస్తున్నం..



మేడారం జాతరలో పారిశుధ్య పనులు చేసేందుకు మహారాష్ట్ర నుంచి వచ్చాం. కాంట్రాక్టర్ చంద్రమోహన్ ఎనిమిది గంటలకు బదులు 12గంటల పని చేయించి రూ.600 మాత్రమే ఇస్తున్నడు. భక్తులు తిని పారేసిన ప్లేట్లు, గ్లాసులు, చెత్త ఏరిపారేస్తున్నాం. పనికి తగ్గ కూలీ ఇస్తే సంతోషంగా ఉండేది.

– నిర్మల, పారిశుధ్య కార్మికురాలు

### కూలీ గిట్టుబాటు కావడం లేదు



బతుకు దెరువు కోసం జాతరలో పనిచేసేందుకు వచ్చినం. ఇక్కడ పని ఎక్కువ పైసలు తక్కువ. అనుకున్నట్లు డబ్బులు రావడం లేదు. కాంట్రాక్టర్ చెప్పిన పని చేయడం తప్ప ఏమీ లేదు. ఆయన ఇచ్చినన్ని పైసలు తీసుకోవాలి. లేకుంటే పని బంద్ చేపిస్తడు. పని లేకుంటే కుటుంబం ఇబ్బందుల్లో పడుతుంది. కష్టం అయినా చేయాల్సి వస్తుంది.

– తారాబాయి, పారిశుధ్య కార్మికురాలు



మేడారంలో ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూస్తున్న తిరుగు ప్రయాణం భక్తులు

# సారూ.. బస్సులేవీ?

**మేడారంలో భక్తులకు తప్పని అవస్థలు**

**తిరుగు ప్రయాణంలో గంటలతరబడి ఎదురుచూపులు**

ములుగు, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ముందస్తు మొక్కుల కోసం మేడారం వచ్చిన భక్తులకు బస్సులు కరువయ్యాయి. తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు లేక గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది. మేడారం వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం తిరుగు ప్రయాణం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రెండు, మూడు గంటలకు ఒక బస్సు రావడంతో భక్తులు ఒక్కసారిగా ఎగబడి సీట్ల కోసం కుస్తీ పడ్డారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారికి సీట్లు దొరకకపోవడంతో మరో బస్సు కోసం ఎదురు చూస్తూ ఉండిపోయారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో పెద్దఎత్తున జాతరకు వస్తుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని భక్తులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు మేడారానికి తరలించిన విధంగా తిరుగు ప్రయాణంలో రద్దీకనుగుణంగా బస్సులు నడిపిస్తే ఇబ్బందులు ఉండవని వాపోతున్నారు. కలెక్టర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు.

# మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా**

**ఎంజీఎంలో ఏటీఎఫ్ సెంటర్ ప్రారంభం**




ఏటీఎఫ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 8: మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా కోరారు. గురువారం సామాజిక న్యాయం, సాధికారత కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 41 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఏటీఎఫ్ (అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ) సెంటర్లను సామాజిక న్యాయం, సాధికారత కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం ఎంజీఎంలో ఏర్పాటు చేసిన ఏటీఎఫ్ సెంటర్‌ను సీపీ, కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కారణాలతో మత్తుకు బానిసైన వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి ఏర్పాటు చేస్తున్న ఏటీఎఫ్ కేంద్రాన్ని వరంగల్‌లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి ఎయిమ్స్ వైద్యాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తామన్నారు. మత్తు పదార్థాల బారిన పడిన వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏటీఎఫ్ కేంద్రానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడి నేరాలకు పాల్పడిన వారిని గుర్తించి సాధారణ స్థితికి తీసుకురావడానికి పోలీసులు గతంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. మత్తు బారిన పడిన వారికి మెరుగైన వైద్య సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేంద్రాన్ని ఏర్పాటుతో నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ దివ్వెల మోహన్‌దాస్, ఎంజీఎం ఆర్‌ఎంఓలు హరీశ్‌రాజ్, శ్రీనివాస్, ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు, ఎంజీఎం ఉద్యోగులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



### మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 8 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ఇస్తున్నట్లు కార్యదర్శి క్యారం సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న శుక్రవారం అమావాస్య, శనివారం యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు అని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు.



దక్షిణమధ్య రైల్వేలో జాతీయ అవార్డుకు ఎంపికైన కాజీపేట డీజిల్ లోకోషెడ్

### కాజీపేట రైల్వే డీజిల్ లోకో షెడ్డుకు జాతీయ అవార్డు

కాజీపేట, ఫిబ్రవరి 8 : కాజీపేట డీజిల్ లోకోషెడ్డును భారతీయ రైల్వే ఉత్తమ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. డీజిల్ లోకోషెడ్‌లో ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబర్చడం, ఒక సంవత్సరంలో అతి తక్కువ వైఫల్యాలు నమోదవడంతో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రస్తుతం ఈ షెడ్‌లో 113 డబ్ల్యూఏజీ-7 ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ జరుగుతున్నది. కాగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కాజీపేట డీజిల్ లోకో షెడ్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

# రాష్ట్ర స్థాయికి హ్యాండ్ రెస్ట్ ప్రాజెక్ట్

**రూపొందించిన ఉప్పరపల్లి విద్యార్థిని స్పందన**

**చేతికి ఫ్రాక్చర్ అయిన వారికి ఉపయోగపడేలా ఇన్నోవేషన్**




తాను రూపొందించిన పరికరంతో విద్యార్థిని స్పందన

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8: మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అందె స్పందన కేవలం రూ.300లతో గాయపడిన వారి కోసం ఇన్నోవేటివ్ హ్యాండ్ రెస్ట్ ఫర్ ఫ్రాక్చర్ అనే పరికరాన్ని తయారు చేసినట్లు గైడ్ టీచర్ బాలాజీరావు గురువారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో 122 ఇన్నోవేషన్స్‌ను విద్యార్థులు ప్రదర్శించగా అందులో 10 రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డీఈఓ వాసంతి ప్రకటించారు. అందులో ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల పరికరం ఎంపికైనట్లు హెచ్ఎం జయ తెలిపారు. ఈ పరికరం ఉపయోగాలను విద్యార్థి స్పందన వివరించింది. ప్లాస్టిక్ పైపులతో హ్యాండ్ రెస్ట్ అనే పరికరాన్ని తయారు చేసినట్లు తెలిపింది. చేయి విరిగినప్పుడు డాక్టర్లు వేసిన సిమెంట్ పట్టి బరువుగా ఉండి ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి వారికి ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పరికరాన్ని చేతికి గాయమైన వారు సులభంగా ఉపయోగించుకోవచ్చు. కూర్చున్నప్పుడు, నిలుచున్నప్పుడు గాయపడిన చేతిని ఈ పరికరంపై ఉంచి సేదతీరవచ్చని, అలాగే పరికరాన్ని రకరకాల ఎత్తులో వాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ బాలాజీరావు, విద్యార్థి స్పందనను ఉపాధ్యాయులు అభినందించారు.

# రెజ్లింగ్ చాంపియన్ వరంగల్

**అండర్-15 రన్నరప్‌గా హైదరాబాద్, తృతీయ స్థానంలో సంగారెడ్డి**

**జేఎన్ఎస్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడలు**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 8 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-15 పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను 87 పాయింట్లతో వరంగల్ జట్టు కైవసం చేసుకుంది. రన్నరప్‌గా హై దరాబాద్, తృతీయ స్థానం లో సంగారెడ్డి నిలిచింది.

**బాలికల అండర్-15..** 33 కేజీల విభాగంలో ములుగు జిల్లాకు చెందిన రాజేశ్వరి 3వ స్థానం, 36 కేజీల విభాగంలో 3వ స్థానంలో వర్ష (వరంగల్), తృతీయ స్థానం అంజలి, 39 కేజీల విభాగంలో వరంగల్‌కు చెందిన మీనాక్షికి ప్రథమ స్థానం, భూపాలపల్లికి చెందిన నిహారిక 3వ స్థానం, 42 కేజీల్లో 3వ స్థానంలో పీ సుష్మా (వరంగల్), కే అక్షయ (ములుగు), 46 కేజీల్లో ములుగుకు చెందిన అశ్విని 3వ స్థానం, 50 కేజీల్లో వరంగల్‌కు చెందిన మానసకు మూడో స్థానం, 54 కేజీల్లో 2వ స్థానం సమీర (వరంగల్), 58 కేజీల్లో 2వ స్థానం కృతిక (భూపాలపల్లి), ములుగుకు చెందిన రష్మిత మూడో స్థానంలో నిలిచింది. అలాగే 62 కేజీల్లో 3వ స్థానం కే అనవిత (భూపాలపల్లి), 66 కేజీల విభాగంలో 3వ స్థానంలో జే అంజలి (వరంగల్), హనుమకొండకు చెందిన బీ అంజని నిలిచింది.

**బాలుర విభాగంలో..**

38 కేజీల విభాగంలో వెంకటేశ్(నిజామాబాద్), వరుణ్‌తేజ(జనగామ), 41 కేజీల్లో ఎండీ అమీర్(వరంగల్), 44 కేజీల్లో ఎం లక్ష్మణ్, 48 కేజీల్లో సింధు(ములుగు), 52 కేజీల్లో ముబిల్(వరంగల్) 57 కేజీల్లో యోగేశ్వర్, 62 కేజీల్లో నరేశ్‌కుమార్, 68 కేజీల్లో అభిషేక్, 75 కేజీల్లో మనీవర్ధన్ (హనుమకొండ), 85 కేజీల్లో ఎస్కే జూనియర్, (మహబూబాబాద్), సారథి, భూపాలపల్లి, విలియం కేరీ (హనుమకొండ) ప్రతిభ కనబరిచారు.

**అండర్-20 రెజ్లింగ్ పోటీలు ప్రారంభం**

అండర్-20 రాష్ట్రస్థాయి బాలబాలికల రెజ్లింగ్ పోటీలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు.



ట్రోఫీ అందుకుంటున్న వరంగల్ జట్టు

అనంతరం అండర్-15లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమం లో హనుమకొండ జిల్లా క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్‌నాయక్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లిం గ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కోశాధికారి సుధాకర్, వివిధ జిల్లాల రెజ్లింగ్ సంఘాల బాధ్యులు జైపాల్, సాయిలు, శ్రీనివాస్, రాజేందర్, సతీశ్, రాజు, వంశీకృష్ణ పాల్గొన్నారు.



బయ్యారం మండలం నామాలపాడులోని ఏకలవ్య పాఠశాల

# అమలు కాని మెనూ.. సరిపోని టిఫిన్

**ఏకలవ్య పాఠశాలలో అర్ధాకలితో విద్యార్థుల ఇబ్బందులు**

**తల్లిదండ్రులకు ఏకరువు**

బయ్యారం, ఫిబ్రవరి 8 : బయ్యారం మండలం నామాలపాడులో ని ఏకలవ్య పాఠశాలలో మెనూ పాటించకపోవడం లేదు. దీంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 300మంది విద్యభ్యసిస్తున్నారు. ఆరు, ఏడు తరగతుల ఒక్కో విద్యార్థికి నెలకు రూ.900, 8,9,10 తరగతు ల వారికి రూ. 1200 డైట్ చార్జీలను ప్రభుత్వం అందిస్తుంది. వీటితో ఉదయం రాగి మాల్ట్, బూస్ట్‌తో పాటు టిఫిన్, ఒక రోజు గుడ్డు, మరో రోజు అరటి పండు, వారంలో ఒక రోజు చికెన్ పెట్టాలి. సాయంత్రం పల్లిపట్టి, స్వీట్ వంటి స్నాక్స్, రాత్రి భోజనం లేదా బగారా రైస్ ఇవ్వా ల్సి ఉంది. అయితే నిర్వాహకులు సరిగ్గా మెనూ పాటించకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. అంతేకాకుండా కొన్ని సార్లు సరిపడా ఆహారం లేకపోవడంతో అర్ధాకలితో విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం టిఫిన్ సరిపోవడం లేదంటూ విద్యార్థులు ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులకు సైతం ఫిర్యాదు చేశారు. తాము పాఠశాలకు వచ్చిన క్రమంలో భోజనం బాగుండడం లేదని, సరిపోవడం లేదని పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రవిబాబును వివరణ కోరగా మెనూ విషయంలో హెచ్చుతగ్గులు అవుతున్న మాట వాస్తవమేనని, డైట్ చార్జీలు సరిపోకపోవడంతో సమస్య తలెత్తుతున్నదని తెలిపారు.


